క్లుప్తంగా

గణపతి పీఠంలో సంకష్టహర చతుర్థి


మరువం అలంకరణలో భోగి గణపతి

బోట్‌క్లబ్‌: స్థానిక సూర్యారావుపేటలోని భోగి గణపతి పీఠంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా గురువారం విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. సహస్ర మరువం దళాలతో శత సహస్రనామ పారాయణ చేశారు. లక్ష ఒత్తులతో అఖండ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా పీఠం ఉపాసకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ చవితికి సమర్పించే 21 పూజా పత్రాల్లో 11వ పత్రిగా ఉన్న మరువం విశేషమైందన్నారు. భోగభాగ్యాలకు శ్రీకరమైంది మరువం అన్నారు.

నేడు కనకమహాలక్ష్మి తల్లి ఆలయ వార్షికోత్సవం

బోట్‌క్లబ్‌: స్థానిక ద్వారకానగర్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ 47వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మాజీ సభ్యుడు అంకం రెడ్డి రామునాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆలయం వద్ద చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి, సాయంత్రం బహుమతులు అందిస్తామన్నారు. సాయంత్రం 6.30 గంటలకు అఖండ జ్యోతి ప్రజ్వలన ఉంటుందన్నారు.

సమస్యలపై పోరాటం

బాలాజీచెరువు: ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన పోరాటం చేస్తుందని ఆ పార్టీ నగర ఇన్‌చార్జ్‌ ముత్తా శశిధర్‌ అన్నారు. మా ప్రాంతం– మా సచివాలయంలో భాగంగా గురువారం 24ఏ వార్డు సచివాలయం పరిధిలో పర్యటించారు. నాయకులు బండి అజయ్‌ ప్రభుదాస్‌, వాసిరెడ్డి శివ, బడే కృష్ణ, శ్రీను, కొండబాబు జానకి, కుమారి పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ


ఏపీఎస్పీ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్‌: రమణయ్యపేట ఏపీఎస్పీ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, జూనియర్‌ కళాశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌ చదువుతున్న విద్యార్థులకు శ్రీసాయి దుర్గ చారిటబుల్‌ ట్రస్ట్‌ అధ్యక్షురాలు సుధారాణి గురువారం అల్పాహారం పంపిణీ చేశారు. పబ్లిక్‌ పరీక్షలు దగ్గర పడడంతో సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆమె అల్పాహారం సమకూర్చగా ఉపాధ్యాయులు, స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ కమిటీ పంపిణీ చేసింది.

నవ దంపతులకు గాయాలు

కాకినాడ క్రైం: రోడ్డు ప్రమాదంలో నవ దంపతులు గాయాల పాలయ్యారు. కాకినాడ స్వర్ణాంధ్ర నగర్‌ కాలనీకి చెందిన ఉప్పల లక్ష్మి తన భర్త సూర్యనారాయణతో కలసి ఏటిమొగలో ఉన్న అత్తయ్య ఇంటికి ద్విచక్ర వాహనంపై బయల్దేరింది. భర్త వాహనం నడుపుతుండగా పాత పోర్టు రైల్వే స్టేషన్‌ సమీపంలో ఓ టిప్పర్‌ సడన్‌ బ్రేక్‌ వేయడంతో ద్విచక్ర వాహనం టిప్పర్‌ వెనుక భాగాన్ని ఢీకొంది. ఈ ఘటనలో దంపతులు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించగా కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పోస్టర్‌ ఆవిష్కరణ


యూటీఎఫ్‌ హోమ్‌లో ప్రజ్ఞా వికాసం పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: ఎస్‌ఎఫ్‌ఐ, యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో కాకినాడ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహిస్తామని యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శులు సూరిబాబు, టి.చక్రవర్తి గురువారం తెలిపారు. ఈ పరీక్షను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక యూటీఎఫ్‌ హోమ్‌లో నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి ఎస్‌ఎఫ్‌ఐ, యూటీఎఫ్‌ నిరంతరం పోరాటాలు చేస్తున్నాయని వివరించారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ముందుగా జిల్లా వ్యాప్తంగా ప్రజ్ఞా వికాసం పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షను జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్‌, ఎయిడెడ్‌ పాఠశాలల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి వర్మ, జిల్లా అధ్యక్షుడు నగేష్‌, జిల్లా నాయకులు ప్రసాదరావు, రమణ, మహేష్‌, జయప్రకాష్‌, రాజబాబు, నగర ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షురాలు జి.సత్య తదితరులు పాల్గొన్నారు.

తయారీ తేదీ.. ఏదీ..!

- స్వీట్‌లపై కాల పరిమితి తేదీ తప్పనిసరి
- పట్టించుకోకుంటే చర్యలు తప్పవంటున్న అధికారులు
- నగరంలో నామమాత్రంగా నిబంధనల అమలు

బోట్‌క్లబ్‌: రంగు రంగుల్లో.. రకాల వెరైటీల్లో.. చూసిన వెంటనే ఆకర్షించే రీతిలో.. ఉండే ఎన్నో రకాల స్వీట్లు దుకాణాల్లో విక్రయిస్తుంటారు. వీటిని పిల్లల నుంచి పెద్దల వరకూ ఎంతో ఇష్టంగా తింటుంటారు. కాస్త ఆగండి.. ఇక్కడే పెద్ద చిక్కు ఉంది. కొందరు కాలం చెల్లిన స్వీట్లను విక్రయిస్తుండడంతో ఆరోగ్యానికి చేటు తెస్తోంది. ఆ తినుబండారాలు తయారు చేసి ఎన్నిరోజుల అవుతుందో.. ఎప్పటి వరకూ తినవచ్చో ముద్రించి విక్రయించాలన్న నిబంధనలను కొందరు విస్మరిస్తున్నారు. యథేచ్ఛగా పాత పద్ధతిలోనే పాడైన స్వీట్లనూ దుకాణాల్లో పెట్టి విక్రయిస్తున్నారు. కాకినాడలోని పలు స్వీట్‌ షాపుల్లో ఈ తంతు జరుగుతోంది. నగరంలో సుమారు 90కి పైగా స్వీట్లు విక్రయించే దుకాణాలు ఉన్నాయి. వీటిలో పదిలోపు దుకాణాల్లో మాత్రమే నిబంధనల ప్రకారం స్వీట్లకు కాలపరిమితి తేదీ ముద్రించి విక్రయాలు చేస్తున్నారు. మరికొందరు మాత్రం వినియోగదారులు కొనుగోలు చేసేటప్పుడు స్వీట్లు తాజాగానే ఉన్నాయని చెప్పి విక్రయిస్తున్నారు. తీరా ఇంటికి తీసుకెళ్లి మరుసటి రోజు తిందామంటే దుర్వాసన రావడంతో పాటు బూజు పట్టి ఉండడంతో వారు అవాక్కవుతున్నారు. ఈ స్వీట్లను వారం రోజుల లోపులోనే విక్రయించాల్సి ఉంటుంది. మరికొన్ని పది రోజుల వరకూ నిల్వ ఉంటాయి. తర్వాత వినియోగించడానికి వీలులేదు. కాలం చెల్లిన వాటిని తింటే అనారోగ్యం బారిన పడతారు. ఇలాంటి మోసాలను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని ప్రకారం అక్కడ విక్రయించే ప్రతి స్వీట్‌పై కాలపరిమితి తేదీ ముద్రించి విక్రయాలు చేపట్టాలని ఫుడ్‌ కంట్రోల్‌ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నిబంధనలు నగరంలో చాలా దుకాణ యజమానులు పాటించడం లేదు. ఈ నిబంధనలు ఎందుకు పాటించడం లేదని యజమానులను పలువురు అడుగుతుంటే వారు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. ఫుడ్‌ సేఫ్టీ అధికారులు దాడులను ముమ్మరం చేసి నిబంధనలు పక్కాగా అమలు అయ్యేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.


ఓ దుకాణంలో కాల పరిమితి తేదీ లేకుండా విక్రయిస్తున్న స్వీట్లు


స్వీట్లకు కాల పరిమితి తేదీ ఇలా వేసి..

ఏడాది నుంచీ అంతే..

గత ఏడాది నుంచి స్వీట్‌ షాపుల్లో కాలపరిమితి తేదీతో స్వీట్లు విక్రయించాలని నగరంలోని ఈ షాపుల యజమానులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొందరు మాత్రం అధికారులు చెప్పిన విధంగా విక్రయిస్తున్నారు. మిగిలిన వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తూ వినియోగదారులను మోసగిస్తున్నారు. ఇటీవల నగరంలో తనిఖీలు చేసిన ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి శాంపిల్స్‌ను ల్యాబ్‌లకు పంపారు.

తప్పక ముద్రించాల్సిందే..



స్వీట్‌ షాపుల్లో విక్రయించే ప్రతి ఆహార పదార్థానికి ఎప్పటి వరకూ తినవచ్చో తేదీలు ముద్రించాలి. అలా విక్రయాలు జరపని దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటాం. గతంలో అందరికీ నోటీసులు ఇచ్చాం. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని స్వీట్‌ షాపులపై కేసులు పెడతాం.

–శ్రీనివాస్‌, అసిస్టెంట్‌ ఫుడ్‌ కంట్రోలర్‌

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు


పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, చిత్రంలో కొడా చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్‌ శివప్రసన్న

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక జగన్నాథపురం 23వ డివిజన్‌ నేతాజీ పార్కు నుంచి గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కేశనవారి వీధి, మర్రిచెట్టు వీధి, గాయత్రి నగర్‌ ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో అందించిన పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కొడా చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్‌ సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు మీసాల దుర్గాప్రసాద్‌, మీసాల శ్రీదేవి, పలువురు కార్యకర్తలు, నాయకులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించాల్సి వచ్చేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటువంటి వ్యవస్థకు స్వస్తి పలికి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. అందువల్లే వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, చోడిపల్లి ప్రసాద్‌, మీసాల ఉదయ్‌కుమార్‌, మాజీ కార్పొరేటర్లు నల్లబిల్లి సుజాత, కర్రి శైలజ, పేర్ల జోగారావు, నగర బీసీ సెల్‌ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి తోడ్పాటు అభినందనీయం


శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్‌ అందిస్తున్న నిర్వాహకులు

కాకినాడ రూరల్‌: గ్రామీణ ప్రాంత మహిళల స్వయం ఉపాధికి కోరమాండల్‌ సంస్థ తోడ్పాటు అందించడం అభినందనీయమని నాబార్డు ఏజీఎం హీరాలాల్‌ అన్నారు. మండలంలోని వాకలపూడి, రమణయ్యపేట గ్రామాలకు చెందిన మహిళలకు కోరమాండల్‌ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్‌, బ్యూటీషియన్‌ శిక్షణను అందించగా గురువారం వాకలపూడి కమ్యూనిటీ హాలులో సర్టిఫికెట్లు, టూల్స్‌ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హీరాలాల్‌ మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలకు మార్కెటింగ్‌ సదుపాయం కల్పించేందుకు నాబార్డు ద్వారా సహకారం అందిస్తామన్నారు. కోరమాండల్‌ యూనిట్‌ హెడ్‌ సీహెచ్‌ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా వాకలపూడికి చెందిన 45 మంది, రమణయ్యపేటకు చెందిన 33 మందికి టైలరింగ్‌, బ్యూటీషియన్‌ శిక్షణ అందించామన్నారు. వలసపాకల మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కోరమాండల్‌ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రస్టు బోర్డు సభ్యురాలికి అభినందన


అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసి వస్తున్న వెంకటలక్ష్మి

సామర్లకోట: అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా గురువారం నేతల వెంకటలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. సామర్లకోట మాజీ కౌన్సిలర్‌ నేతల వెంకటలక్ష్మిని ట్రస్టు బోర్డు సభ్యురాలిగా నియమించిన విషయం తెలిసిందే. అన్నవరం దేవస్థానం అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసినట్లు ఆమె గురువారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

హాకీ పోటీలకు ఏర్పాట్లు చేయండి

- క్రీడాకారులకు ఇబ్బంది రానీయొద్దు
- జిల్లా కలెక్టర్‌ కృతికా శుక్లా ఆదేశం


హాకీ పోటీల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్‌ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: స్థానిక జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 15 నుంచి జాతీయ మహిళా హాకీ క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ కృతికా శుక్లా ఆదేశించారు. ఈ పోటీల నిర్వహణకు సంబంధించి గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో రెవెన్యూ, నగర పాలక సంస్థ, జేఎన్‌టీయూ, వైద్య ఆరోగ్యం, సమాచార పౌరసంబంధాలు, పోలీస్‌, ట్రాన్స్‌పోర్టు, విద్యా, రంగరాయ వైద్య కళాశాల, సెట్రాజ్‌, హాకీ క్రీడల కోఆర్డినేటర్‌ తదితరులతో కలసి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాకీ ఇండియా ఆధ్వర్యంలో హాకీ ఆంధ్రప్రదేశ్‌ సంఘం నిర్వహిస్తున్న 13వ జాతీయ స్థాయి మహిళా హాకీ పోటీలకు కాకినాడ జిల్లా ఆతిథ్యం ఇస్తుందన్నారు. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకూ తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో సుమారు 26 రాష్ట్రాల జట్లకు సంబంధించి సుమారు 600 మంది మహిళా క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందని వివరించారు. అదే విధంగా 50 మంది హాకీ ఇండియా, మరో 40 మంది ఇతర అతిథులు హాజరు కానున్నారన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్‌ ఆదేశించారు. గత ఏడాది జూనియర్‌ హాకీ పోటీలు నిర్వహించామని, ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆహ్లాదకర వాతావరణంలో పోటీలు జరిగేలా చూడాలన్నారు. జిల్లా క్రీడా మైదానంలో పారిశుధ్య పనులు, తాగునీరు, మొబైల్‌ టాయిలెట్స్‌, నగరంలో హోర్డింగ్స్‌ ఏర్పాటు, గ్రౌండ్‌ చదును వంటి పనులను కాకినాడ నగరపాలక సంస్థ చూడాలని కమిషనర్‌కు కలెక్టర్‌ సూచించారు. అదే విధంగా ఆరోగ్య, పోలీస్‌ శాఖలు సంబంధిత ఏర్పాట్లు చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, రిజర్వ్‌డ్‌ పోలీస్‌ అదనపు ఎస్పీ బి.సత్యనారాయణ, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌ ఎల్‌.సుమలత, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌ కె.రమేష్‌, వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ ఎం.శాంతిప్రభ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ నరసింహారావు, ఆర్డీవోలు పీవీ సాయిప్రసాద్‌, రమణ, ఇన్‌చార్జి డీఈవో డానియేల్‌ రాజ్‌, సెట్రాజ్‌ సీఈవో డీఎస్‌ సునీత, హాకీ ఇండియా కోఆర్డినేటర్‌ వి.రవిరాజు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌ కోచ్‌ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేయండి

కన్వీనర్లు, గృహ సారథులకు ఎమ్మెల్యే ద్వారంపూడి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ సిటీ: కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమష్టిగా పనిచేసి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఏ కన్వెన్షన్‌లో నాలుగు నుంచి 13వ డివిజన్‌ వరకూ ఉన్న కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వీటిని ప్రతి గడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత గృహ సారథులపై ఉందన్నారు. తరచూ ప్రతి ఇంటి యజమానిని కలసి అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ సమస్యలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. రానున్న ఏడాది ఎంతో కీలకమని ముఖ్యంగా కన్వీనర్లు, గృహ సారథులు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. కొడా చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మరింత కష్టించి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మేయర్‌ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం జగన్‌ పాటుపడుతున్నారని, ఆయా పథకాలను ప్రతి గృహసారథి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పథకాల అమలులో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్‌ పసుపులేటి వెంకటలక్ష్మి, స్మార్ట్‌ సిటీ మాజీ చైర్మన్‌ అల్లి రాజబాబు, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎంఎస్‌ రాజు, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు గురువారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లి శివారు రవీంద్రపురానికి చెందిన కోసిరెడ్డి శ్రీను (30) అప్పుల బాధ తాళలేక గత నెల 24న తన ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యార్థుల వివరాలు సమగ్రంగా ఉండాలి


చిన్నారుల వివరాలను సేకరిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు టి.శ్రీహరి

సామర్లకోట: అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులతో పాటు ప్రైవేట్‌ పాఠశాలల్లో చదువుతున్న ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారుల డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు టి.శ్రీహరి అన్నారు. గురువారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రోత్సహిస్తుందని, దీనికి అనుగుణంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేట్‌ పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను ఎంఆర్పీల నుంచి సేకరించారు. వీటిని 24 గంటల్లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.శివ రామకృష్ణయ్య, జిల్లా ఈ–హాజరు కోఆర్డినేటర్‌ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌లో ప్రాక్టికల్స్‌ కీలకం


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కళాశాల ఏడీ నాయుడు, ప్రిన్సిపల్‌ కరుణ

బాలాజీచెరువు: ప్రాక్టికల్‌ నాలెడ్జ్‌ భవిష్యత్‌ స్టార్టప్‌ ప్రోగ్రామ్‌కు తోడ్పడుతుందని గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ మల్లా రామారావు అన్నారు. స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో లైఫ్‌ సైన్స్‌ విభాగం ఆధ్వర్యంలో ఎకోటెన్‌ 2కే–23 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌ సబ్జెక్టులో ప్రాక్టికల్‌ నాలెడ్జ్‌ అత్యంత ముఖ్యమన్నారు. కళాశాల అకడమిక్‌ డైరెక్టర్‌ బీఈవీఎల్‌ నాయుడు మాట్లాడుతూ లైఫ్‌ సైన్స్‌ వల్ల భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌ కె.కరుణ మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రాజెక్టుల ద్వారా అద్భుతంగా ప్రదర్శించారన్నారు. ప్రస్తుతం క్యాన్సర్‌ వ్యాధి ప్రభావం, దాని ఎదుర్కొనే విధానం గురించి చక్కగా వివరించారన్నారు. అనంతరం పలు ప్రాజెక్టులు, క్విజ్‌ విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ నాగ శ్రీకాంత్‌, అధ్యాపకులు రత్నం, అరుణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం


సామర్లకోటలో మాండవ్య నారాయణస్వామికి గ్రామోత్సవం

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువ అవతలి వైపు ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం గురువారం సాయంత్రం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మ నక్షత్రమైన ఉత్తరాషాఢ కావడంతో తెల్లవారు జామున స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లైఓవర్‌ బ్రిడ్జి, స్టేషన్‌ సెంటర్‌, గాంధీచౌక్‌, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, నీలమ్మ చెరువు, మఠం సెంటర్‌ కొత్తూరు, స్టేషన్‌ సెంటర్‌ మీదుగా స్వామివారి గ్రామోత్సవం సాగింది. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

సమష్టి కృషితోనే మెరుగైన పారిశుధ్యం


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌ నాగనరసింహారావు

కాకినాడ సిటీ: ప్రజలు, సిబ్బంది సమష్టి కృషితోనే మెరుగైన పారిశుధ్యం సాధ్యమని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌ సీహెచ్‌ నాగనరసింహారావు అన్నారు. గురువారం ఆయన స్థానిక ఏడో డివిజన్‌ పరిధి పద్మనాభనగర్‌లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. తడి, పొడి చెత్తను రోడ్లపై వేయడాన్ని గుర్తించారు. చెత్త సేకరణకు ప్రతి ఇంటికీ సిబ్బంది వస్తున్నప్పుడు చెత్తను రోడ్లపై వేయడం సరికాదన్నారు. ఈ విషయంలో పారిశుధ్య విభాగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అప్పుడే కాకినాడను క్లీన్‌ సిటీగా ఉంచగలమని స్పష్టం చేశారు. పారిశుధ్యం విషయంలో ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా ఉన్నా ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ తదితరులు ఉన్నారు.

జ్ఞాన నేత్రంతో భగవంతుని దర్శనం


ఎమ్మెల్యే పెండెం దొరబాబును సత్కరిస్తున్న ఉమర్‌ ఆలీషా

పిఠాపురం: మానవుడు తనలోని అంతర్లీనంగా ఉన్న జ్ఞాననేత్రాన్ని గుర్తించగలిగితే తద్వారా భగవంతుడిని దర్శించవచ్చని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్‌ ఉమర్‌ ఆలీషా అన్నారు. ఆశ్రమ ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించే పీఠం 95వ వార్షిక మహాసభలను గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలతో కూడిన అరిషడ్వర్గాల వల్ల మానవులు భ్రాంతి శక్తులకు లోబడుతున్నారన్నారు. భ్రాంతి వల్ల కష్టాలను అనుభవించడానికి మానవుడు ఇష్ట పడపడడని, అందువల్లే తన కష్టాలు తీర్చమని స్వామీజీలను, గురువులను దర్శిస్తారని పేర్కొన్నారు. కష్టాన్ని ఇష్టపడి స్వీకరిస్తే భ్రాంతి శక్తి తొలగిపోతుందని తెలిపారు. తాత్విక జ్ఞానం పొందడం ద్వారా అంతర్లీనంగా ఉన్న జ్ఞాన నేత్రం తెరుచుకుంటుందన్నారు. మానవుడిని మహనీయుడిగా మలిచే జ్ఞాననేత్రం పొందడానికి ఆధ్యాత్మికత ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. దీనిలో భాగంగా పీఠం ఆధ్వర్యంలో చేపట్టిన 'నామొక్క–నా శ్వాస' కార్యక్రమంలో ప్రతిఒక్కరూ మూడు మొక్కలను నాటాలని సూచించారు. పీఠం రూపొందించిన 2023 నివేదిక ఆయన ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబును సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తానా చైర్మన్‌ తోటకూర ఈశ్వర ప్రసాద్‌, వైఎస్సార్‌ సీపీ నేతలు గండేపల్లి బాబీ, కొత్తపల్లి బుజ్జి, వర్ధినీడి సుజాత, రెడ్డెం జనార్దనరావు, బొజ్జా రామయ్య, జనసేన నేత పిల్లా శ్రీధర్‌, పీఠం కన్వీనర్‌ పేరూరి సూరిబాబు, మీడియా కన్వీనర్‌ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఔట్‌ పోస్ట్‌ పరిశీలన


సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు ఔట్‌ పోస్ట్‌ను గురువారం జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సమాచారం అందించడంతో పాటు రక్షణ కల్పించే ఉద్దేశంతో ఔట్‌ పోస్ట్‌ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్‌బీ డీఎస్పీ అంబికా ప్రసాద్‌, పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడలో బషీర్‌ బీబీ ఉరుసు ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఎస్సై రామలింగేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. పొన్నాడలోని బషీర్‌బీబీ(బంగారు పాప) దర్గా వద్ద శుక్రవారం నుంచి జరుగనున్న ఉర్స్‌ ఉత్సవాల ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఆదివారం వరకూ మూడు రోజల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగే గంధోత్సవం ఎంతో కీలకమన్నారు. ఈ ఉత్సవాలకు కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్‌, గొల్లప్రోలు మండలాల నుంచి సుమారు 100 మందితో సిబ్బందితో భారీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు తమ పిల్లలను జాగ్రత్తగా గమనించుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. దర్గా వద్ద పోలీస్‌ కంట్రోల్‌ రూం ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.

హైవేపై ట్రాక్టర్‌ బోల్తా

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరు శివారులో గురువారం సాయంత్రం ట్రాక్టర్‌ అదుపుతప్పి బోల్తా పడింది. ఆ వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట వైపు నుంచి బూడిద లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ తాళ్లూరు శివారులో దాబా వద్ద రోడ్డు దాటే క్రమంలో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది చర్యలు తీసుకున్నారు. డ్రైవర్‌ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.